# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-3 22, డిసెంబరు, 2014

తెలంగాణ రాష్ట్రంలోని విద్యా విధానం వృత్తి నైపుణ్యాన్ని పెంచే విధంగా, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు పోటీ పడేలా ఉండాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆకాంక్షించారు. రాష్ట్రంలో కేజి టు పిజి ఉచిత విద్యా విధానాన్ని అమలు చేయడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కేజి టు పిజి విద్యా విధానం ఏలా ఉండాలి అనే విషయంపై విద్యా రంగంలోని నిపుణులతో తానే స్వయంగా రౌండ్ టేబుల్ సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. తెలంగాణలో కేజి టు పిజి విద్యా విధానం అంశంపై సచివాలయంలొ సోమవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి డా.రాజయ్య, విద్యాశాఖ మంత్రి జగదీష్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు బివి.పాపారావు, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, కన్సల్టెంట్ ఉపేందర్ రెడ్డి, ఎస్ఇఆర్టి డైరెక్టర్ జగన్నాథ రెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ అడీషినల్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ఓఎస్‌డి (విద్య) దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో విద్యా విధానం బావితరాలను ఉత్తమ పౌరులుగా, దేశానికి ఉపయోగపడే మానవ వనరులుగా తయారు చేసే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. విద్య కోసం పెట్టే ఖర్చు వృధా పెట్టుబడి అనే నీచ ప్రచారం కూడా గతంలో జరిగిందని, ఫలితంగా ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రమాణాలు దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కాని తమ ప్రభుత్వం విద్య కోసం పెట్టే ఖర్చును అత్యంత ఉపయుక్తమైన కార్యక్రమంగా భావిస్తున్నదని, మంచి విద్యను అందించడం ద్వారానే మానవ వనరుల అభివృద్ధి జరుగుతుందనేది తన దృఢ విశ్వాసమని ముఖ్యమంత్రి అన్నారు. కేజి టు పిజి విద్యావిధానాన్ని ఎలా అమలు చేయాలనే విషయంపై ఈ సందర్భంగా చర్చించారు. ఏ తరగతి నుండి ఇంగ్లీష్ మీడియం ప్రారంభించాలి? ఏ వయసు నుండి పిల్లలు హాస్టల్‌లో వుండటం మంచిది? విద్యా బోధన

చేయడానికి ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులు సరిపోతారా? వారికి అదనంగా ఏమైనా శిక్షణనివ్వాలా? బోధన అంశాలు ఎలా ఉండాలి? తదితర విషయాలపై చర్చించారు. కేజి టు పిజి విద్యా విధానం మొత్తం సమాజంతో ముడిపడి ఉన్న అంశం కాబట్టి దీనిపై విస్తృత స్థాయిలో చర్చ జరగాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇందుకోసం త్వరలోనే ఎస్ఇఆర్‌టి, ఎన్‌సిఇఆర్‌టి, ప్రొఫెసర్లు, విద్యావంతులు, విద్యా రంగంలో అనుభవం ఉన్న వారితో తానే స్వయంగా రౌండ్ టేబుల్ సదస్సు నిర్వహిస్తానని, అందరి అభిప్రాయాలు తీసుకొంటానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక బృందాన్ని దేశంలో, ప్రపంచంలో అత్యున్నత విద్యా విధానం అమలు చేస్తున్న ప్రాంతాలకు పంపి అధ్యయనం చేయిస్తానని కూడా వెల్లడించారు. ఈ రెండు ప్రక్రియలు పూర్తయిన తరువాత తెలంగాణలో కేజి టు పిజి విద్యా విధానం అమలుకు సంబంధించిన పూర్తి ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

కేజి టు పిజి విద్యా విధానంలో భాగంగా మొదటి సంవత్సరం నియోజకవర్గానికి ఒక రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించి, నిర్వహణలోని సాధక బాధకాలను గమనించి మరుసటి ఏడాది నుండి పాఠశాలలను విస్తరించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. పది నుండి పదిహేను ఎకరాల స్థలంలో ఈ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉండాలని, అందులో హాస్టల్, స్కూల్, ప్లే గ్రౌండ్, డైనింగ్ హాల్ తదితర నిర్మాణాలన్నీ అత్యంత ఆధునికంగా, సౌకర్యవంతంగా జరగాలన్నారు. అటాచ్డ్ టాయిలెట్‌తో కూడిన గదిలో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండాలన్నారు. గురుకుల పాఠశాలల్లో అందించే ఆహారం కూడా పోషక విలువలతో కూడుకుని ఉండాలని చెప్పారు. కేవలం పప్పు చారుతో సరిపెట్టకుండా గుడ్డు, తాజా, నాణ్యమైన కూరగాయలు వండాలని, ప్లేట్లు, గ్లాసులను కూడా స్టెరిలైజ్ చేసి వాడాలని ముఖ్యమంత్రి చెప్పారు. కలెక్టర్, ఎస్‌పి లాంటి అధికారులు కూడా తమ పిల్లలను ఈ పాఠశాలల్లోనే చదివించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని వివిధ స్కీముల్లో అనేక తరహా పాఠశాలలు ప్రస్తుతం ఉన్నాయని, వాటన్నింటిని క్రమంగా రెసిడెన్షియల్

పాఠశాలలుగా మారుస్తామన్నారు. రాష్ట్రమంతా ఒకే తరహా పాఠశాలలు, ఒకే సిలబస్, ఒకే భోజన మెనూ, ఒకే పద్ధతి, ఒకే పరీక్షల విధానం ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. కుల మతాల గురించి పట్టింపు లేకుండా పిల్లలందరూ ప్రభుత్వ ఖర్చుతోనే ఒకే చోట చదవాలని, దీనివల్ల అంతరాలు లేని సమాజం సృష్టించవచ్చని ముఖ్యమంత్రి అభిలషించారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలు ఓ నవ లోకం కావాలని ఆకాంక్షించారు. పాఠ్యాంశాల్లో శాంతి భద్రతలు, మహిళల పట్ల గౌరవంగా ఉండడం, సాంస్కృతిక వికాసం, నైతిక ప్రవర్తన లాంటి అంశాలు కూడా ఉండాలని చెప్పారు. విద్యా విధానం విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యం పెంచే విధంగా ఉండాలని అన్నారు. భవిష్యత్తులో ఎంతమంది డాక్టర్లు, ఇంజనీర్లు, ఇతర ఉద్యోగులు, వృత్తి నిపుణులు కావాలో ముందుగానే అంచనా వేసుకొని అందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దటం ఉత్తమమైన మార్గమని ముఖ్యమంత్రి అన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం